# వయసొచ్చిన మనసు

కాశీనాథుని సువర్చలాదేవి

ఏమిటో ; శకుంతలమ్మ గారింట్లో కోలాహలం. అయ్యో ; నా మతి మండిపోను వాళ్ళ రాధ పెండ్లికదూ ; రాధ ఎంత అదృష్టవంతురాలో. రాధా కాబోయే భర్తా బజారు వెళ్ళి చీరలు, నగలు కొనుక్కొని వచ్చారట. ఒక్క క్షణమయినా వదలి ఉండలేనట్లు "అబ్బా ఇంకా నాలుగు రోజులుంది పెళ్ళి అన్ని రోజులు చూడకుండా ఎలాఉండను." అన్నాడట. రాధ ఎంత గర్వంగా చెప్పుకున్నదో ; అతనికి బెంగుళూరులో పనిట. క్వార్టర్సుకూడా ఇచ్చారట. చక్కని ఇల్లు, అందమైన భర్త. కోరుకుంటే మాత్రం అందరికీ ఆ అదృష్టం ఉండవద్దూ ! అదుగో వదిన అప్పుడే కేకలు పెడ్తున్నది, ఇంకా ఆరయినా కాలేదు. "రాణిగారు కాఫీ త్రాగివెళ్ళండి" వదిన ఎందుకట్లా అంటుందో. అవునుమరి నేను రాణిగారినేగా ; అన్ని పనులలో ఎంత సహాయం చేసినా వదినకు తృప్తి లేదు. పిల్లలకు నీళ్ళు పొయ్యడం దగ్గరనుంచి రాత్రి వంటయిల్లు కడిగేవరకూ సహాయం చేసినా వదినకి ఇంకా ఏదో చెయ్యలేదని అసంతృప్తి. ఒక్కరోజు విశ్రాంతిగా కూర్చోటానికి ఉండదు. రోజూ పనే. ఆదివారమయినా సినిమాకు వెళదామంటే— ఆ రోజు పిల్లల్ని నేనే చూసుకోవాలి. రోజూ తన పిల్లల్ని తను చూసుకోవటం నాకు ఉద్ధరింపు. వదిన సరదాగా స్కూటరుమీద అన్నయ్య భుజాలను పట్టుకొని కొత్త పెళ్ళికూతురిలా నలుగురు పిల్లల్ని వదిలి వెళ్ళిపోతుంది ఇందులో నాన్న గోల. చదివిన చదువులు చాలక ఇంకా ఏదో చదివితే ఇంకా ఏదో ప్రమోషనువస్తుందంటారు. నాన్న ఉద్దేశం నేను భారత దేశానికి ప్రధాన మంత్రిని కావాలనేమో ; పోనీ అన్నయ్యయినా అయ్యో! పెళ్ళి కావలసిన చెల్లెలు ఉన్నదని కొంచెమయినా అనుకోకుండా వాళ్ళ సరదాలేమో ; సంతోషాలేమో ; అయినా వాళ్ళనని ఏం లాభం ; బాధ్యతగల తండ్రికే లేకపోయిన తరువాత ;. సుజాత— రాధ చెల్లెలు వస్తున్నది. తప్పకుండా పెళ్ళికి వస్తానని చెప్పి పంపాను. ఎట్ల వెళ్ళను. రాధ నాకన్నాకనీసం పది సంవత్సరాలయినా చిన్నదై ఉంటుంది. ఈర్ష్య పడుతున్నానా ; ఏమో ! చూచిన వాళ్ళంతా ఇంకా పెళ్ళెప్పుడు చేసుకుంటావమ్మాయ్ అంటారు. పెళ్ళికి నేనే ఏదో విముఖత చూపిస్తున్నట్లు. ఇంతకీ ఇదంతా తలవ్రాత. పెళ్ళిమీద మోజు పోయి చాలా సంవత్సరాలయింది ఎన్ని రోజులని అన్నయ్యా వదినలకు సేవ చేస్తూ ఉండాలి. పుష్కరానికొక పెండ్లి కొడుకు రావటం, కట్నం ఎంత ఇస్తారని అడగటం, చదువు చెప్పించాము కదా ; కట్నం ఇవ్వం అనటం, వాళ్ళు వెళ్ళిపోవటం పరిపాటయిపోయింది.

అయినా ఎన్నాళ్ళని 16 సం॥ బాలా కుమారిలాగా అలంకరించుకొని మ్యూజియంలో బొమ్మలాగే కూర్చోవటం. ఈసారి మాత్రం ఎవరు వచ్చినా శృంగారించుకొని వెళ్ళను. అమ్మయ్యా ; పిల్లలకు నీళ్ళు పొయ్యటం, బట్టలు వెయ్యడం, టిఫెను డబ్బాలలో అన్నం పెట్టడం అయింది. నెమ్మదిగా ఆఫీసుకు బయలుదేరుతాను. ఆ ఆఫీసులో ప్రక్కన శంకరంగారి గోల. పెళ్ళాము, పిల్లలు, రోగాలు—అన్నీ ఓపికగా వినాలి. ఒకరకంగా ఆఫీసే బాగుంటుందేమో ! శంకరం సంసార విషయాలు,

శ్రీధరు సరోజల దొంగ చూపులు. టైపిస్టు కోమల శబ్ధాలు. మధ్యాహ్నం లంచి టైములో కాంటీను. సీతాకోక చిలుకల్లాంటి యువతులు ఏమిటో వదిన సాధింపులకంటే ఆఫీసు ఎంతో నయం. ఏం జీవితమో! ప్రొద్దున అయిదు గం॥ నుంచి రాత్రి పదకొండు గంటల వరకూ నిర్విరామంగా పని చెయ్యవలసిందే! కనుచూపు మేరలో వెలుగు కనబడటం లేదు. అయిదయినట్లున్నది. అందరూ లేస్తున్నారు. బజారు వెళ్ళి రాధకేదయినా ప్రజంటు కొనాలి. రాధ కృష్ణుల దంతపు విగ్రహం తీసుకుంటే బాగుంటుంది. రాధా కృష్ణులలాగా—రాధ, శేఖర్‌లు అన్యోన్యంగా ఆనందంగా ఉంటారేమో! అయినా నా పిచ్చి కాని! భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండక పోట్లాడుకుంటారా! నాన్నకెప్పటికయినా పెళ్ళి చెయ్యాలనే ఆలోచన వస్తుందా! అదిగో మేళాలు వినపడుతున్నాయి. ఈ చీర చాల్లేదూ పెళ్ళికి—అయినా నేనేమయినా పెళ్ళికూతురినా! తలలో నెరిసిన వెంట్రుకలెన్నో! రాధ మెడలో మాంగల్యం కడుతున్నప్పుడు అతనిముఖంలో ఎంత సంతోషం. రాధ ముగ్ధంగా మనోహరంగా ఉంది. అవును రాధ కన్నె పిల్ల. మరి తనో! అదేమిటి? అప్పుడే వెళ్ళిపోతావా! అంటుంది గాని శాత అక్కడ నేనెట్లా ఉండగలనో ఆలోచించదే! నా స్థితిలో తను ఉంటే అసలు పెళ్ళికి వచ్చేదా! అన్నం తినాలని లేదు. రోజూ తినే అన్నమేగా! పాలు తోడు పెట్టకుండా పడుకున్నావా! వదిన అరుస్తున్నట్లున్నది. అబ్బ వదిన ఏంమనిషో. అన్నమయినా తినకుండా పడుకున్నదే అని అన్నయ్య గాని, వదిన గానీ అడిగారా! ఎందుకడుగుతారు? రాత్రి పదకొండు గంటలకు వచ్చే నాన్నకి, నేను హాయిగా నిద్ర పోతున్నాననుకుంటారు. మూసిన కన్నుల వెనుక ఎన్ని మూగ బాధలున్నవో నాన్నకేం తెలుసు. తెలిసిన అమ్మ ఏం చేయగలదు. గడియారం టంగుటంగున పదకొండు కొట్టిందేమిటి అప్పుడే! పడుకునే టైము అయినట్లున్నది. అన్నయ్య గదిలోనుంచి సన్నగా నవ్వులు వినపడుతున్నాయి. ఏంమాట్లాడుకుంటారో! వాళ్ళ సరదాలల్లో నాసంగతెందుకు వస్తుంది. వచ్చే అవకాశమేది? వాళ్ళకి తీరికేది? అబ్బ కళ్ళు బరువుగా వాలిపోతున్నాయి. నిద్ర వస్తున్నదేమో! ఏమో! ఆలోచనల బరువు వలనకూడా అవచ్చుగదా!